రోడ్డు మూసివేయడంపై నిరసన


నిరసన తెలుపుతున్న పీరంచెరువు మాజీ సర్పంచ్ నాగరాజు తదితరులు

బండ్లగూడ: రోడ్డును మూసి వేయడం తగదని పీరంచెరువు మాజీ సర్పంచ్ నాగరాజు అన్నారు. స్థానికులతో కలిసి బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ పరిధిలోని సర్వే నంబర్ 51 గుండా 20 ఏళ్లుగా రోడ్డును ఉపయోగించుకుంటున్నారన్నారు. సాయిబాలాజీ నగర్ నుంచి వెస్టెండ్ కాలనీ మీదుగా సన్‌సిటీ వెళ్లే ఈ రోడ్డు అనేక కాలనీలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పుడు మూసి వేయడం సరైన పద్ధతి కాదని, వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. మానవతా దృక్పథంతో పట్టాదారులు, స్థానిక నాయకులు సహకరించాలని ఆయన కోరారు. అలాగే రోడ్డును పున:ప్రారంభించాలని కోరుతూ గండిపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశామని, దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో కొరివి గణేశ్, హరీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం’


రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మల్కారం వాసులు

శంషాబాద్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్కారం గ్రామానికి చెందిన పలువురు రాజేంద్రనగర్ పార్టీ ఇన్‌చార్జి కె.నరేందర్ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరగా వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఎంపీగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, మరింత అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలన్నారు. రైతు సంఘం మండలాధ్యక్షుడు కొత్త యాదగిరిరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు జంగయ్య, జంగిలి తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి మహేందర్, ఉపాధ్యక్షుడు కోటేశ్వర్‌గౌడ్, జీవన్‌గౌడ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫక్రుద్దీన్, డీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీక్, మాజీ సర్పంచ్‌లు సిద్దేశ్వర్, చంద్రశేఖర్, ఉపసర్పంచ్ సురేశ్‌నాయక్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఆందస్, నాయకులు నవీన్‌రెడ్డి, ప్రభాకర్, రవీందర్‌గౌడ్, లక్ష్మయ్య, శ్రీనుగౌడ్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం


కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: మాణిక్యమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి, టి.లలితా, కర్ణం నారాయణ ముదిరాజ్, మాజీ వార్డు మెంబర్ ఉమా మహేశ్వరి, నాగేందర్, ఎం.నర్సింగ్ రావు, విలేజ్ అధ్యక్షుడు ఎం.శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ నదిలో ఎగిసిపడ్డ మంటలు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని మూసీ నదిలో బుధవారం భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. లంగర్‌హౌస్ నుంచి వచ్చే బ్రిడ్జి దాటిన తర్వాత రింగ్‌రోడ్డు వైపు వెళ్లే మార్గంలో కిరణ్ చికెన్ సెంటర్ ఎదురుగా నదిలో చెత్తకు గుర్తు తెలియన వ్యక్తులు నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేయడంతో ప్రమాదం తప్పింది. ఇదిలా ఉండగా చెత్త సేకరించే కొందరు మూసీ నదిలో వైర్లను కాల్చి అందులోని కాపర్, అల్యూమినీయం తీసుకెళ్తున్నారు. వారే నిప్పంటించి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నారు.

హైదర్‌షాకోట్‌లో కిడ్నాప్ డ్రామా


బాలుడిని ప్రశ్నిస్తున్న పోలీసులు, స్థానికులు

మణికొండ: ఇంటికి త్వరగా రావాలని తండ్రి మందలించడంతో ఓ బాలుడు కిడ్నాప్ డ్రామా ఆడిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్ రఘురాంనగర్ కాలనీలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో అద్దెకు ఉంటున్న దేవ్‌యాదవ్ కుమారుడు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ప్రతిరోజు ఇంటికి ఆలస్యంగా వస్తుండడంతో 2 రోజుల క్రితం తండ్రి సాయంత్రం 7 గంటల్లోపు ఇంటికి రావాలని మందలించాడు. దాంతో మంగళవారం రాత్రి హైదర్‌షాకోట్ నుంచి రేతిబౌలికి వెళ్లి అక్కడ ఓ మెడికల్ షాపు నుంచి తన తండ్రికి ఫోన్ చేసి నన్ను ఎవరో కిడ్నాప్ చేశారని, వారి నుంచి తప్పించుకుని రేతిబౌలి వద్ద ఉన్నానని ఫోన్ చేశాడు. దాంతో తండ్రి స్థానిక నాయకుడు టింకు రెడ్డితో కలిసి అక్కడికి వెళ్లి రేతిబౌలి నుంచి బాలుడిని తీసుకువచ్చాడు. అతడిని ప్రశ్నించగా బైక్‌పై తనను ఇద్దరు వ్యక్తులు కిడ్నాప్ చేశారని, వారి నుంచి రేతిబౌలి సిగ్నల్ వద్ద తప్పించుకున్నానని తెలిపాడు. విషయం పోలీసుల వరకు వెళ్లడంతో వారు వచ్చి బాలుడిని మరోసారి ప్రశ్నించడంతో ఎలాంటి వివరాలు చెప్పలేదు. దాంతో బాలుడే కిడ్నాప్ డ్రామా ఆడి ఉంటాడని స్థానికులు పేర్కొన్నారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీధర్ తెలిపారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని నార్సింగి అడ్మిన్ ఎస్సై సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

‘జయంతి వేడుకల్లో రాజకీయాలు తగవు’


మాట్లాడుతున్న శ్యామల్‌రాజ్

రాజేంద్రనగర్: మహనీయుల జయంతి వేడుకలు ఆధిపత్యవర్గ, పెట్టుబడి, దోపిడీ రాజకీయాలకు అడ్డాలుగా మారుతున్నాయని బహుజన్ ముక్తి పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రంపల్లి శ్యామల్‌రాజ్ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. సామాజిక అసమానతలు, అణచివేత, దోపిడీ, బానిస బతుకుల విముక్తికి కారకులైన ఆధిపత్యవర్గ పెట్టుబడిదారి పాలకులతో మహనీయులైన పెరియార్ రామస్వామి, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజీలేని పోరాటం చేసి మహనీయులయ్యారని కొనియాడారు. కానీ కొందరు స్వార్థపరులు, దళారులు మహనీయుల ఆశయాలకు విరుద్ధంగా వారి జయంతి వేడుకలను ఆధిపత్యవర్గ వారి కనుసన్నల్లో నిర్వహిస్తూ వారి రాజకీయ ప్రయోజనానికి ఉపయోగపడేలా చేస్తున్నారని మండిపడ్డారు.

నేడు మాసాబ్‌ట్యాంక్ వద్ద ట్రాఫిక్ మళ్లింపు

గోల్కొండ: మాసాబ్‌ట్యాంక్ హాకీ గ్రౌండ్‌లో నేడు రంజాన్ ప్రార్థనలు జరగనున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ పోలీసులు మాసాబ్ ట్యాంక్ నుంచి బంజారాహిల్స్, బంజారాహిల్స్ నుంచి మెహిదీపట్నం వచ్చే వాహనాదారులకు పలు సూచనలు చేశారు. గురువారం ఉ.8 నుంచి 11.30 గంటల వరకు వాహనాలను దారి మళ్లిస్తున్నారు. మెహిదీపట్నం నుంచి మాసాబ్‌ట్యాంక్ మీదుగా లక్డీకాపూల్ వెళ్లే వాహనాలు కేవలం ఫ్లైఓవర్ మీద నుంచే వెళ్లాలి. అదే విధంగా లక్డీకాపూల్ నుంచి వచ్చే వాహనాలు మాసాబ్‌ట్యాంక్ ఫ్లై ఓవర్ నుంచి వెళ్లాలి. ఫ్లైఓవర్ కింద నుంచి వాహనాలు వెళ్లేందుకు అనుమతి లేదు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 నుంచి మాసాబ్ ట్యాంక్ వెళ్లే వాహనాలను అనుమతి లేదు. ఈ వాహనాలను బంజారాహిల్స్ నుంచి తాజ్‌కృష్ణా, ఆర్టీఏ ఖైరతాబాద్ కార్యాలయం వైపు మళ్లిస్తారు.

పంచాయతీకి 11 వేలు..!

- ఒక్కో నర్సరీలో మొక్కల లక్ష్యం
- మొత్తం 27 జీపీల్లో 2,97,000 పెంపకం
- ఉపాధి హామీ పథకం నిధులతో నిర్వహణ
- మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ
- వచ్చే వానాకాలంలో నాటేందుకు సన్నాహాలు


మండలంలోని కవ్వగూడలో నిర్వహిస్తున్న నర్సరీ


రషీద్‌గూడ నర్సరీలో పెంచుతున్న మొక్కలు

శంషాబాద్ రూరల్: వచ్చే వానాకాలం సీజన్‌లో నాటేందుకు అవసరమైన మొక్కల పెంపకంపై అధికారులు దృష్టి పెట్టారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో వీటిని పెంచుతున్నారు. మండలంలో 27 జీపీలు ఉండగా.. పంచాయతీకి 11 వేల మొక్కల చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించారు. గతేడాది ప్రతి పంచాయతీలో 10 వేల మొక్కలు పెంచగా, ఈసారి 20 రకాల మొక్కలను మొత్తంగా 2,97,000 పెంచుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో మొక్కల కోసం నర్సరీల్లో బ్యాగుల్లో మట్టిని నింపారు. నవంబర్‌లో విత్తనాలు నాటగా ప్రస్తుతం మొక్కలుగా ఎదిగాయి.

మొక్కల సంరక్షణకు చర్యలు..

వారం రోజుల నుంచి ఎండలు దంచి కొడుతున్నాయి. దీంతో నర్సరీల్లో మొక్కల సంరక్షణకు షెడ్‌నెట్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఎండ నేరుగా మొక్కలపై పడకుండా జాగ్రత్త పడుతూ.. మొక్కలు చనిపోకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆయా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను వచ్చే జూన్‌లో వర్షాలు పడగానే పంపిణీ చేయనున్నారు.

అటవీ ప్రాంతాల అన్వేషణ..

నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఆయా గ్రామాల్లోని రోడ్లు, వీధులు, ఖాళీ ప్రదేశాల్లో నాటేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఆయా గ్రామాల్లో మొక్కల డిమాండ్‌ను సేకరించారు. సుమారు 36 వేల మొక్కలు నాటేందుకు పంచాయతీలు ప్రణాళికలు రూపొందించాయి. నర్సరీల్లో పెంచుతున్న మిగిలిన మొక్కలను ప్రభుత్వ స్థలాలు, అటవీ ప్రాంతాల్లో నాటేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. గతేడాది మల్కారంలో ఉన్న అటవీ ప్రాంతంలో 10 వేల మొక్కలు నాటారు. వచ్చే సీజన్‌లో కూడా ఇక్కడ మొక్కలు నాటేందుకు అటవీ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఉపాధి హామీ పథకం మండల అధికారులు పేర్కొంటున్నారు.

ఉపాధి పనులు అంతంతే..

నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని ఉపాధి హామీ నిధులతో చేపడుతున్నారు. అయితే వేసవిలో ఈ పథకం కూలీలకు ఉపాధి కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు ప్రారంభించారు. ననాజీపూర్‌లో పీర్లకుంట, పాల్మాకులలో మైసమ్మ చెరువుతో పాటు సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టగా నెల రోజులుగా కొనసాగుతున్నాయి. అయితే ఉపాధి పనులు చేసేందుకు కూలీల నుంచి స్పందన అంతంత మాత్రంగానే వస్తోంది. నానాజీపూర్‌లో 219 జాబ్ కార్డులు ఉండగా.. ఇందులో 153 కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. అయితే పనులకు పదుల సంఖ్యలో మాత్రమే కూలీలు వస్తున్నారు. పాల్మాకులలో సైతం 397 కార్డులకు గాను 217 కార్డులు యాక్టివ్‌గా ఉండగా ఇక్కడ 15 మంది వరకు మాత్రమే ఉపాధి పనులకు హాజరవుతున్నారు.


వినతి పత్రం అందజేస్తున్న శంషాబాద్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నేతలు

కార్మికుల పనివేళలు మార్చాలి

శంషాబాద్: వేసవి సందర్భంగా కార్మికుల పనివేళలు మార్చాలంటూ శంషాబాద్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లవారుజామునే విధుల్లో చేరుతున్న పారిశుధ్య కార్మికులు, నీటి సిబ్బందికి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే విధులు కేటాయించాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు నీరటి మల్లేశ్, నగేశ్, ప్రవీణ్, జలంధర్, సత్యమ్మ తదితరులు ఉన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం


అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేతలు

శంషాబాద్: పట్టణంలోని తొండుపల్లిలో కొమ్మగంటి అంజమ్మ, రాములుగౌడ్‌ల జ్ఞాపకార్థం రాజుగౌడ్ ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అంబలి కేంద్రం ద్వారా దాహార్తి తీర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్‌గౌడ్, అంజయ్యగౌడ్, బక్కరత్నం, ప్రసాద్‌గౌడ్, అశోక్‌గౌడ్, శేఖర్, నరేందర్ , మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోచమ్మ ఆలయ వార్షికోత్సవం


విద్యుత్ కాంతుల్లో పోచమ్మ ఆలయం

మైలార్‌దేవ్‌పల్లి: మార్కండేయనగర్ పోచమ్మ ఆలయం ఎనిమిదో వార్షికోత్సవాన్ని ఈనెల 11న (నేడు) నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించామని పేర్కొన్నారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చనలు, హోమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

నీటి వ్యాపారంపై రెవెన్యూ అధికారుల కొరడా


జేసీబీలతో తాత్కాలిక నీటి సంపులను ధ్వంసం చేయిస్తున్న సిబ్బంది


ఖానాపూర్‌లో బోర్లను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

మణికొండ: విచ్చలవిడిగా సాగుతున్న నీటి వ్యాపారంపై రెవెన్యూ అధికారులు బుధవారం కొరడా ఝులిపించారు. గండిపేట మండలపరిధిలోని ఖానాపూర్ గ్రామంలో వ్యవసాయం పేరుతో బోర్లు, విద్యుత్ కనెక్షన్లు తీసుకుని ఇష్టారాజ్యంగా ట్యాంకర్లతో నీటిని అమ్ముకుంటున్నారు. దీంతో చుట్టుపక్కల పొలాలతో పాటు గృహాల్లోని బోర్లు వట్టిపోతున్నాయని గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన తహసీల్దార్ నక్రా శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో 18 బోర్లను సీజ్ చేశారు. అలాగే తాత్కాలిక ఏర్పాటు చేసిన నీటి సంపులను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వాల్టా చట్టం ప్రకారం నీటి వ్యాపారం నిషేధమని, భూములు ఉన్న వారు వ్యవసాయం మాత్రమే చేసుకోవాలన్నారు. సీజ్ చేసిన బోర్లను తిరిగి పనిచేయిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు కరెంట్ సరఫరాను తొలగించాలని విద్యుత్ శాఖకు లేఖ రాస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు విక్రంరెడ్డి, సురేశ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



గ్రాంట్స్ చెక్కుల అందజేత

మణికొండ: వివిధ రంగాల్లో స్టార్టప్‌లు నెలకొల్పి రాణిస్తున్న వారికి ఏసీఐసీ–సీబీఐటీ తరపున గండిపేటలోని చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల వారు నిధులను అందజేశారు. గండిపేటలోని కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మొదటి బహుమతిగా శ్రీ రాజారాజేశ్వర వ్యవసాయ పరిశ్రమ వ్యవస్థాపకుడు ప్రవీణ్‌కుమార్‌కు రూ.8 లక్షలు, రెండో బహుమతి వాతావరణ ప్రభావ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారాలు చూపే పరిశ్రమ వ్యవస్థాపకుడు దీప్తి అబ్రహంకు రూ.15 లక్షలు, మూడో బహుమతి ఫ్రూమ్ టెక్నాలజీస్ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాల మీద పరిశోధన చేస్తున్న సంస్థ వ్యవస్థాపకుడు జయకుమార్‌కు రూ.8.5 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు మాట్లాడుతూ అసాధారణమైన స్టార్టప్‌లు, అంకిత భావం, సృజనాత్మకత, బలమైన నిబద్ధతకు ఉదాహరణలుగా నిలుస్తాయన్నారు. సమాజంలో సానుకూల మార్పునకు కృషి చేస్తున్న వారికి మద్దతు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏసీఐసీ–సీబీఐటీ విభాగాధిపతి విజయ, స్టార్టప్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు పూర్తి

రాజేంద్రనగర్: బుధవారం రాత్రి నెలవంక కనిపించడంతో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో రంజాన్ పండుగకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రాజేంద్రనగర్, శివరాంపల్లి, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం తదితర ప్రాంతాల్లో ముస్లింలు ప్రార్థనలు చేసేందుకు వీలుగా ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను దారి మళ్లిస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.